ఈనాడు
అమరావతి
గుంటూరు
ఆదివారం అక్టోబరు 18, 2026

విధేయతకు వీరతాడు

మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మీఅపర్ణ, పక్కన రవీంద్ర

- గుంటూరు తెదేపా మేయరు అభ్యర్థిగా లక్ష్మీ అపర్ణ
- అనూహ్య మలుపుల అనంతరం ఖరారు
- కోవెలమూడి ఇంట శ్రేణుల సంబరం

ఈనాడు - అమరావతి

విధేయతకు వీరతాడు పడింది. తెలుగుదేశం పార్టీనే నమ్ముకున్న కోవెలమూడి కుటుంబానికి పార్టీ అధిష్ఠానం అనూహ్య అవకాశం కల్పించింది. గుంటూరు నగరపాలక సంస్థ మేయరు స్థానానికి అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పేరును శనివారం రాత్రి ప్రకటించింది.

పార్టీకి అండగా....

కోవెలమూడి రవీంద్ర రాజకీయాల్లోకి వచ్చినప్పట్నుంచి తెదేపాతోనే ఉన్నారు. అధినేత చంద్రబాబును వైకాపా ప్రభుత్వం అరెస్టు చేసినపుడు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచారు. గతంలో అనేక పదవులకు ఆయన పేరు ప్రచారంలోకి వచ్చినా.. పార్టీ పదవులకే పరిమితమయ్యారు. 2019 ఎన్నికల్లో పశ్చిమ స్థానం నుంచి గెలిచిన మద్దాలి గిరి వైకాపాలో చేరిపోవడంతో కార్యకర్తలకు అండగా నిలిచి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టారు.

కార్పొరేటర్‌గా గెలిచి..

2021లో జీఎంసీ ఎన్నికల్లో తెదేపా కార్పొరేటర్‌గా గెలిచారు. 2024 సాధారణ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం టికెట్ ఆశించారు. సామాజికవర్గ సమీకరణాల్లో గల్లా మాధవికి టికెట్ దక్కినా ఆమె విజయానికి కృషి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పలువురు వైకాపా కార్పొరేటర్లు తెదేపాలో చేరడం, మేయరు మనోహర్‌నాయుడు రాజీనామా చేయడంతో రవీంద్రకు అధిష్ఠానం అవకాశం కల్పించింది. మేయరుగా పని చేసిన పది నెలల కాలంలో రూ.600 కోట్ల విలువైన పనులను మంజూరు చేశారు.

రవీంద్ర ఇంటి వద్ద కార్యకర్తల సందడి

నాడు ఆయన... నేడు ఆమె

రవీంద్ర తక్కువకాలం మేయరుగా పని చేయడంతో మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరుతూ వచ్చారు. మేయరు పీఠం జనరల్ మహిళకు కేటాయించడంతో ఆయన సతీమణి లక్ష్మీ అపర్ణకు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. అధిష్ఠానం పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని రెండుసార్లు ఐవీఆర్ఎస్ నిర్వహించి లక్ష్మీ అపర్ణ పేరు ప్రకటించింది. దీంతో కోవెలమూడి ఇంటి వద్ద కార్యకర్తలు, అనుచరులు, అభిమానులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆదివారం నామినేషన్ వేయడానికి సిద్ధమయ్యారు.

రోజంతా మలుపులే...

మేయరు అభ్యర్థి ఎంపిక పలు మలుపులు తిరిగింది. శనివారం రాత్రి నుంచి ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేరు తెరపైకి వచ్చింది. ఆమె అమెరికాలో ఉండడంతో వెంటనే బయల్దేరి రావాలని పార్టీ సూచించిందని ప్రచారం జరిగింది. ఆమె శనివారం హైదరాబాద్ చేరుకున్నారు. అధిష్ఠానం సీటు ఖరారు చేస్తే ఆదివారం నామినేషన్ వేసేందుకు అవసరమైన కసరత్తు చేశారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసి.. ఆమోదం పొందాకే నామినేషన్ వేయాల్సి ఉంటుంది. ఇందుకు ఏర్పాట్లు చేసుకున్నా.. చివరకు దక్కలేదు.

“లక్ష్మీ అపర్ణ డిగ్రీ చదివారు. భర్త రవీంద్రతోపాటే ఆమె కూడా సత్యసాయి భక్తురాలు. సేవారంగంలో ఉన్నారు.”

చంద్రబాబుకు రుణపడి ఉంటా...

కార్పొరేషన్ ఎన్నికల్లో మేయరుగా పోటీ చేసే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు. వారు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మేయర్‌గా విజయం సాధించాక ప్రజలకు సేవ చేస్తా. నగరాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా.
- లక్ష్మీ అపర్ణ - న్యూస్‌టుడే, పట్టాభిపురం

అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్పీ

ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. శనివారం ఎస్పీ తన కార్యాలయంలో మాట్లాడుతూ అభ్యర్థులు రాజకీయ పార్టీల సభలు, ర్యాలీలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత అభ్యర్థి నామినేషన్ పరిశీలనపై ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు కేసులు నమోదు చేశామని, వాటిలో గుంటూరులో మూడు, తెనాలిలో ఒకటి ఉన్నాయని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించటానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

సిరి వందన.. హరి చందన

మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనం



న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, విజయవాడ వన్‌టౌన్: దసరాశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏడో రోజు ఇంద్రకీలాద్రిపై మహాలక్ష్మీదేవి అలంకారంలో ఉన్న జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రముఖులతో పాటు సామాన్య భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి, కుమ్మరిపాలెం సెంటరు మార్గాలు భక్తులతో నిండిపోయాయి. అష్ట ఐశ్వర్య ప్రదాయిని మహాలక్ష్మీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు, అల్లరి నరేశ్, సుబ్బరాజు తరలివచ్చారు.

తరలివచ్చిన భవానీ దీక్షాధారులు.. ఉత్సవాల చివరి రోజున వచ్చే భవానీ దీక్షాధారులు ఈ ఏడాది నాలుగు రోజులు ముందుగానే తరలిరావడంతో క్యూలైన్లు అరుణ వర్ణంగా మారాయి. రాష్ట్రంలోని చిన్న దేవాలయాల్లో అర్చక సేవలు అందిస్తున్న వారిని దసరా ఉత్సవాలను పురస్కరించుకొని అర్చక సభ నిర్వహించి సత్కరించడం సంప్రదాయం. ఇందులో భాగంగా రాష్ట్ర దేవాదాయ కమిషనర్ రామచంద్రమోహన్ చేతులమీదుగా అర్చక సత్కార కార్యక్రమాన్ని దుర్గగుడి అధికారులు నిర్వహించారు.

జగన్మాత దుర్గమ్మగా దర్శనం నేడు.. 8వ రోజు ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మగా భక్తులకు దర్శనమిస్తుంది. ‘దుర్గే దుర్గతి నాశిని’..అంటే దుర్గమ్మ దర్శనం చేసుకున్నవారి కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

చేవ లేక.. చేతకాక

- భూగర్భ మురుగునీటి ప్రాజెక్టుకు పాతరేసిన వైకాపా పాలకవర్గం
- దిష్టిబొమ్మల్లా ఎస్టీపీలు.. దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లు



అధికారం చేతికొస్తే చూడాల్సింది ప్రజల బాగోగులు.. నగరాభివృద్ధి. కానీ.. నాటి వైకాపా ప్రభుత్వం, పాలకవర్గాలు చేసింది వేరు. వారి పాపాలు ప్రజల పాలిట శాపాలుగా మారాయడానికి గుంటూరు నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులు ఓ ఉదాహరణ. ఈ ప్రాజెక్టు చక్కగా ముందుకెళ్తున్న సమయంలో అధికారంలోకి వచ్చిన వైకాపా పాలకవర్గం పూర్తిగా పక్కన పెట్టేసింది. అప్పటి వరకు చేసిన వందల కోట్ల రూపాయల వ్యయాన్ని నీరుగార్చేసింది. ఎక్కడికక్కడ దిష్టిబొమ్మల్లా మారిన ఎస్టీపీలు.. కుంగిపోయి, లీకేజీలమయంగా మ్యాన్‌హోళ్లతో పరిస్థితిని అధ్వానంగా మార్చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఈ ప్రాజెక్టును గాడిన పెట్టేందుకు అధికారులు రంగంలోకి దిగారు.

“పిచ్చిమొక్కలు, మురుగు మధ్య అసంపూర్తిగా ఉన్న ఈ నిర్మాణం గుంటూరు నగర భూగర్భ మురుగు నీటి వ్యవస్థలో భాగంగా ఏటుకూరు రోడ్డు గార్బేజ్ ట్రాన్సిట్ పాయింట్ పక్కన నిర్మించిన ఎస్టీపీ. వైకాపా పాలనలో గాలికొదిలేయడంతో తుప్పు పట్టిన ఇనుప చువ్వలు, పగుళ్లిచ్చిన దిమ్మెలతో ఇలా దర్శనమిస్తోంది. పునాదులు సైతం దెబ్బతిన్నాయి.”

“ఇది గోరంట్ల స్టాక్‌పాయింట్. యూజీడీ మెటీరియల్ వినియోగించక పాడైపోతోంది. మున్ముందు పూర్తిస్థాయిలో ఉపయోగించలేని పరిస్థితి. తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.”

పెరిగిన అంచనా వ్యయం..

వైకాపా నిర్లక్ష్యం వల్ల నిర్మాణాలు దెబ్బతినడమే కాదు.. మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో ప్రాజెక్టు పూర్తికి రూ.550 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు. సీఆర్డీఏ నుంచి రూ.150 కోట్లు, జీఎంసీ నుంచి రూ.150 కోట్లు, ఇతర మార్గాల ద్వారా రూ.250 కోట్లు సమీకరించేందుకు గతేడాది డిసెంబరులో కసరత్తు చేసి కూటమి ప్రభుత్వానికి నివేదించారు.

నేతాజీనగర్ శివారులో అండర్‌గ్రౌండ్ మ్యాన్‌హోల్ పగిలిపోయి ఇలా...

“శారదాకాలనీ మెయిన్‌రోడ్డు, సంజీవయ్యనగర్ పరిసరాల్లోని భూగర్భ మురుగుకాలువ మ్యాన్‌హోళ్ల దుస్థితి ఇది. పనులు ఆగిపోవడం, ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల నిర్వహణ సరిగా లేక మూతలు భూమిలోకి కుంగిపోయి, విరిగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.”

కనండి.. వినండి

వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యం

2017లో నాటి తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.854 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులను ప్రారంభించారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేసింది. నిర్మాణ సంస్థకు రూ.54 కోట్ల బకాయిలను చెల్లించకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రస్తుతం ప్రాజెక్టు క్షేత్రస్థాయి స్థితి ఇలా..

పైపు లైన్లు	మ్యాన్ హోళ్లు	ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు	సీవరేజ్ ట్రీట్మెంట్
1,083 కిలోమీటర్లకుగాను 550 కిలోమీటర్లే పూర్తి	43,574కు గాను 20,376 మాత్రమే నిర్మించారు.	87,148కు గాను 22,247 నిర్మించారు.	ఐదింటికి గాను ఒక్కటీ పూర్తికాలేదు.

వైకాపా పాలకవర్గ నిర్లక్ష్యం వల్ల 20% పైపులైన్లు, మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి.

★ వైకాపా నగర పాలకవర్గం పనులను పట్టించుకోకపోవడంతో పైపులైన్లు శిథిలమయ్యాయి. మ్యాన్‌హోళ్లు, ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు భూగర్భంలోకి కూరుకుపోయి దాదాపు 20 శాతానికి పైగా ధ్వంసమయ్యాయని ఇంజినీర్లు నివేదిక ఇచ్చారు.

అసంపూర్తిగా వదిలేసిన 5 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణం పూర్తికాక.. పిచ్చిమొక్కల మధ్య శిథిలస్థితికి చేరుకున్నాయి. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికీ పాత మురుగు కాలువలే దిక్కయ్యాయి.

“వందల కోట్ల రూపాయలు వెచ్చించినా ఉపయోగం లేదనడానికి నిదర్శనమిది. నిర్మాణం పూర్తి కాకుండానే పూడిపోవడంతో మ్యాన్‌హోళ్ల వద్ద మురుగునీరు లీకవుతూ రోడ్లపైకి పోటెత్తుతోంది. నగరంపాలెం, కన్నావారితోట, బ్రాడీపేట, శ్రీనగర్, అరండల్‌పేట.. ఇలా అనేకచోట్ల ఇదే పరిస్థితి.”

- ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ (గుంటూరు)

నేటి మధ్యాహ్నం 3 గంటల వరకే...

నామినేషన్ల దాఖలుకు ముగియనున్న గడువు

తెనాలిలో బోణీ చేయని కూటమి

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ (గుంటూరు)

నామినేషన్ల దాఖలుకు గడువు నేటితో ముగియనుంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకే సమయం ఉండడంతో ముహూర్తాలను పక్కనపెట్టి నామపత్రాలను దాఖలు చేసేందుకు ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. ★ గుంటూరు నగరపాలక సంస్థకు సంబంధించి వైకాపా మేయర్ అభ్యర్థి తాడికొండ అలివేలువెంకట నాగపద్మ శ్రీదేవి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తన భర్త, కోడలితో కలిసి బృందావన్ గార్డెన్స్‌లోని జీఎంసీ సర్కిల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎంఎల్ నరసింహారావుకు ఒక సెట్ నామపత్రాలు అందించారు. ఆమె వెంట వైకాపా ముఖ్య నాయకులెవరూ రాలేదు. ఆదివారం మరో సెట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

రిటర్నింగ్ అధికారి నరసింహారావుకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాగపద్మ శ్రీదేవి

- **గుంటూరు నగర పాలక సంస్థలో నామినేషన్లు ఇలా..** ★ తొలి రోజు: 08 ★ రెండోరోజు: 155 ★ తెదేపా-63, వైకాపా-59, జనసేన-20, భాజపా-4, సీపీఐ-1, సీపీఎం-1, కాంగ్రెస్-1, స్వతంత్రులు-14. ★ మేయర్ అభ్యర్థికి: వైకాపా-1, ఇతర పార్టీలు-1, స్వతంత్ర అభ్యర్థి-1
- **తెనాలి పురపాలికలో నామినేషన్లు ఇలా..** ★ తొలి రోజు : 04 ★ రెండో రోజు: 21 ★ వైకాపా అభ్యర్థులు-25, ఛైర్‌పర్సన్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి-1. ★ కూటమి అభ్యర్థులు ఇంతవరకు బోణీ చేయలేదు.

ఇంతింతై.. గుంటూరింతై..

మీకు తెలుసా?

1866లో గుంటూరు నగరం పురపాలక సంఘంగా ఆవిర్భవించింది. అంచెలంచెలుగా ఎదుగుతూ.. ప్రధాన వాణిజ్య కేంద్రంగా.. విద్యా సంస్థలకు ఆలవాలంగా.. ఆటోమొబైల్ రంగానికి కీలకంగా.. మిర్చి, పత్తి వ్యాపారానికి కేంద్రబిందువుగా రూపాంతరం చెందింది. నేడు రాజధాని ప్రాంతంలో అత్యంత ప్రాధాన్యం ఉన్న ప్రాంతంగా పేరొందుతోంది. ఆనాటి నుంచి నేటి వరకు జనాభా పెరుగుదల ఇలా ఉంది.

సంవత్సరం	జనాభా
1866	50 వేలు
1994	4.85 లక్షలు
2011	7.44 లక్షలు
2026	10.01 లక్షలు

★ 2011 జనాభా లెక్కల ప్రకారం చదరపు కిలోమీటరుకు జనసాంద్రత: 14,634

విస్తీర్ణం ఇలా..

1994కు ముందు 47.21 చదరపుకిలోమీటర్లు

10 గ్రామాల విలీనం అనంతరం ప్రస్తుతం: 168.41 చదరపు కిలోమీటర్లు

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ ఛానళ్లు, కేబుల్ ఛానెల్, సినిమా హాల్ తదితర ఎలక్ట్రానిక్ ప్రకటనలకు సంబంధించి ముందుగా మీడియా సర్టిఫికేషన్ మీడియా మానిటరింగ్(ఎంసీఎంసీ) నుంచి మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రకటన ఇవ్వదలచిన విషయం వీడియో, అందులోని అంశాలకు సంబంధించిన స్క్రిప్ట్, సమయం, తయారీ ఖర్చు, ఏ మీడియాలో ప్రసారం చేస్తున్నారు.., వ్యయం తదితర అంశాలను సమర్పించాలని సూచించారు. ప్రసార వీడియో.. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగానే ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజు ఇచ్చే ప్రకటనలకు కూడా అనుమతులు తప్పనిసరని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని కలెక్టర్ కోరారు.

ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై కంట్రోల్ రూం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. అలాగే ఎన్నికలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూం నంబర్: 0863-2234014 అందుబాటులో ఉందని ఆయన చెప్పారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెనెరా మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ షాహిన్నా హుస్సేన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 99891 79786
ఆస్తి తనిఖీ కొరకు : 94945 26440

Appendix – IV –A
[See Proviso to Rule 8(6) R/w Rule 9(1)]
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు రూల్ 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి **ఋణగ్రహీత: శ్రీ బిట్రా విజయ్‌కుమార్,** తండ్రి: బిట్ర సాంబశివరావు, డి.నెం.12-8-36, మారుతీ నగర్, 3వ లేన్, అత్మకూరు గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు ఆంధ్రప్రదేశ్-522503. **శ్రీ బిట్రా విజయ్‌కుమార్, మెస్సర్స్ పాల్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ సెంటర్,** హెచ్ నెం.5-277/14, 5వ వార్డు, నిర్మల ఫార్మసీ వెనుక, అత్మకూరు గ్రామం, మంగళగిరి, గుంటూరు ఆంధ్రప్రదేశ్-522503. **శ్రీ బిట్రా విజయ్‌కుమార్,** డి నెం.157, సమీప డోర్ నెం.8-36, నిర్మల ఫార్మసీ వెనుక, అత్మకూరు గ్రామం, మంగళగిరి, గుంటూరు ఆంధ్రప్రదేశ్-522503. **శ్రీమతి బిట్రా మార్గరెట్,** భర్త: బి.విజయ్‌కుమార్, డి.నెం.12-8-36, మారుతీ నగర్, 3వ లేన్, అత్మకూరు గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు ఆంధ్రప్రదేశ్-522503. **శ్రీమతి బిట్రా మార్గరెట్,** భర్త: బి.విజయ్‌కుమార్, హెచ్.నెం.21-492/2-4, భాస్కరపురం, అతీర్వాదపురం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. **శ్రీమతి బిట్రా మార్గరెట్, భర్త: బి.విజయ్‌కుమార్,** డోర్ నెం.14-99, టి.ఎఫ్.3, శ్రీ శ్రీనివాస రెసిడెన్సీ, వెలగపూడివారి వీధి, యనమలకుదురు, పెనమలూరు మండలం, విజయవాడ-521 007 వారు **డిమాండ్ నోటీసు తేది.27-05-2026** ప్రకారం **తేది.27-05-2026** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.1,60,15,886.79/-** (అక్షరాల ఒక కోటి అరవై లక్షల పదిహేను వేల ఎనిమిది వందల ఎనభై ఆరు రూపాయల డెబ్బై తొమ్మిది పైసలు మాత్రమే) + **తేది.28.05.2026** నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి వారిచే లాంఛనాత్మక స్వాధీనత పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే" "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "రికోర్స్ లేకుండా" పద్ధతిపై" తేది: 26-11-2026**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతకు ఇందుమూలముగా సూచించటమైనది.

షెడ్యూల్ ఆస్తి వివరములు:

రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం.14860/2019, తేది.08.11.2019, మంగళగిరి ఎస్ఆర్‌ఓ. ప్రకారం శ్రీమతి బిట్రా మార్గరేట్, భర్త: విజయ్ కుమార్ గారి పేరున గల ఆస్తి : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-రిజిస్ట్రీ, మంగళగిరి మండలం, అత్మకూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ఎల్.పి.నెం.3/2004, ప్లాట్ నెం.94-పిబిటిఎమ్, ఆర్.ఎస్.నెం.146, 147, 148/2 వద్ద 252 చ॥గ॥లు లేదా 211.68 చ॥మీ॥ల ఇంటి స్థల విస్తీర్ణంలో బేస్‌మెంట్ లెవల్ నిర్మాణంతో గల యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.73 లోని ఆస్తి – 73.42 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం.93 లోని ఆస్తి – 54 అ॥లు, **పడమర :** 40 అ॥ల వెడల్పు రోడ్డు – 42 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.95 లోని ఆస్తి – 54 అ॥లు., పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం **252 చ॥గ॥లు లేదా 211.68 చ॥మీ॥ల స్థలం.**

రిజర్వు ధర : **రూ.50,40,000/-** | ధరావత్తు : **రూ.5,04,000/-** | బిడ్ పెంపుదల : **రూ.10,000/-**

ఇ-వేలం తేది : **26-11-2026,** సమయం : ఉ॥ **11.00** గం॥ల నుండి సా॥ **04.00** గం॥ల వరకు
వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు **5** ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : తేది:19-10-2026 నుండి 25-11-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క వెబ్ సైట్ : **www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices**లో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, లాగిన్, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ **M/s. PSB Alliance & M/s. Baanknet** యొక్క ఇ-వేలం పోర్టల్ : **https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com** & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - **8291220220, Mail ID : support.baanknet@psballiance.com**ను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఐదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటుటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం మొగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కోనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.
ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194-1A యొక్క ప్రొవిజన్స్ ప్రకారం అమ్మకం జరుగును.

తేది: 17-10-2026, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హాయ్... నేనేనండి.. నాకే ఓటేయండి

వాట్సప్‌లో మెసేజ్‌లు... వాయిస్ రికార్డులు

సమయం లేక డిజిటల్ వ్యూహాల అమలు

ఈనాడు - అమరావతి

మున్సిపల్ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. నామినేషన్ల దాఖలుకు గడువు నేటితో ముగియనుంది. ప్రచారానికి పట్టుమని వారం రోజుల సమయం కూడా లేకపోవడం... పైగా మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అభ్యర్థులు సంప్రదాయ ప్రచారానికి సమాంతరంగా డిజిటల్ వ్యూహాలకు తెర లేపారు.

డివిజన్లవారీగా గ్రూపులు

సంక్షిప్త సందేశాలు

- అభ్యర్థులు వాట్సప్‌నే తమ ప్రధాన అస్త్రంగా మలచుకుంటున్నారు. డివిజన్లోని ప్రతి ఓటరు ఫోన్ నంబరు సంపాదించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.
- డివిజన్లవారీగా వాట్సప్ గ్రూపులు.. ప్రతి వీధికి, బ్లాక్‌కు ఒక్కో గ్రూప్ చొప్పున క్రియేట్ చేసి అభ్యర్థి ప్రొఫైల్, హామీలు, గతంలో చేసిన సేవలను వివరిస్తూ సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు.
- చదవడం రాని ఓటర్లను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులే స్వయంగా మాట్లాడింది రికార్డ్ చేసి ఆడియో మెసేజ్‌ను నేరుగా ఓటర్ల వాట్సప్‌లకు పంపుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఫేస్‌బుక్, ఇన్‌స్టా రీల్స్‌తో

‘జెన్-జీ’ ఓట్లకు గాలం

- యువతను.. కొత్తగా ఓటు హక్కు పొందిన జెన్-జీ ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు డిజిటల్ క్యాంపెయిన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ఫేస్‌బుక్‌లో లైవ్ సెషన్లు పెడుతూ డివిజన్ సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన రీల్స్, షార్ట్ వీడియోలతో హోరెత్తిస్తున్నారు.
- ట్రోల్ వీడియోలను వాట్సప్ స్టేటస్, సోషల్ మీడియా పేజీల ద్వారా వైరల్ చేస్తూ యూత్ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
- తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను చేరవేయడానికి కొందరు డిజిటల్ పాంప్లెట్లు వాడుతున్నారు.

“ఒకవైపు వర్ష సూచన.. మరోవైపు ప్రచారానికి గడువు తక్కువగా ఉండడంతో అభ్యర్థులు కంగారు పడుతున్నారు. కాలి నడకన ప్రతి ఇంటికి వెళ్లడం కష్టసాధ్యమైన నేపథ్యంలో డిజిటల్ మాధ్యమాల ద్వారానే రోజులో పదిసార్లు ఓటర్ల మొబైల్ స్క్రీన్లపై ప్రత్యక్షం కావాలని వ్యూహాలు రచిస్తున్నారు.”

మిర్చియార్డుకు దసరా సెలవులు

మిర్చియార్డు, న్యూస్‌టుడే : గుంటూరు మిర్చియార్డుకు విజయ దశమి సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు కావడం వల్ల విక్రయాలు జరగవు. వ్యాపారులు, కార్మికుల అభ్యర్థన మేరకు యార్డుకు సెలవు ఇచ్చారు. మంగళవారం దసరా పండగ. ఈ క్రమంలో వరుసగా నాలుగు రోజులపాటు సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో క్రయవిక్రయాలు జరగవు. రైతులు గమనించి సోమవారం సరకును యార్డుకు తీసుకురావద్దని ఛైర్మన్ కుర్రా అప్పారావు సూచించారు. యథావిధిగా బుధవారం నుంచి విక్రయాలు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

వేగంగా ఎన్నికల సమాచారం

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వివరాలను మొబైల్ అప్లికేషన్‌లో ‘ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సిస్టం’ను వినియోగించడం వల్ల జిల్లా యంత్రాంగానికి వేగంగా సమాచారం చేరుతుందని జిల్లా పరిషత్తు డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ అన్నారు. శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మండలాల ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపునకు సంబంధించి వివరాలు మొబైల్ అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటిని తిరస్కరించాలని తెలిపారు. ఎక్కడా వివాదాలకు తావులేకుండా.. ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీపీవో బి.వి.నాగసాయికుమార్ పాల్గొన్నారు.

ICAR-CENTRAL INSTITUTE FOR RESEARCH ON COTTON TECHNOLOGY
(Indian Council of Agricultural Research)
Adenwala Road, Matunga, Mumbai - 400 019.
HYBRID MODE INTERVIEW
ICAR-CIRCOT పరిధిలోని వివిధ ప్రాంతీయ కేంద్రాలు మరియు విభాగాలలో **"యంగ్ ప్రొఫెషనల్-I"** (YP-I) హోదాలో మొత్తం ఇరవై (20) కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి. ఈ ఇంటర్వ్యూలు హైబ్రిడ్ పద్ధతిలో (ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్) జరుగుతాయి. ఇవి 03.11.2026న నాగ్‌పూర్‌లోని GTC వద్ద మరియు 04.11.2026 & 05.11.2026 తేదీలలో ముంబైలోని ICAR-CIRCOT కార్యాలయంలో ఉదయం 11:00 గంటల నుండి ప్రారంభమవుతాయి. అర్హతలు, వేతనం, వయో పరిమితి, ఇంటర్వ్యూ తేదీలు మరియు సమయాలు వంటి పూర్తి వివరాల కోసం, ఆసక్తిగల అభ్యర్థులు ICAR-CIRCOT వెబ్‌సైట్: **https://circot.icar.gov.in**ను సందర్శించగలరు.
Sd/- Senior Administrative Officer

Scanned with OKEN Scanner